ప్ర'జల'ప్రాణాలతో చెలగాటం

- నీటి సరఫరాలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం
- జిల్లాలో విజృంభిస్తున్న అతిసారం
- తొమ్మిది నెలల్లో పది మంది మృతి
- తాజాగా ఆత్మకూరులో ఇద్దరి మృతితో కలకలం
- కలుషిత జలం సరఫరాపై ఫిర్యాదు చేసినా పట్టించుకోని మున్సిపల్ అధికారులు

సాక్షి, నంద్యాల: కలుషిత నీరు ప్రజల ప్రాణాలు కబళిస్తున్నా కూటమి ప్రభుత్వం చోద్యం చూస్తోంది. జిల్లాలో మంచినీటి సరఫరా వ్యవస్థ అధ్వానంగా మారి జనం రోగాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నా పట్టనట్లు వ్యవహరిస్తోంది. 9 నెలల కూటమి పాలనలో జిల్లాలో పది మంది అతిసారం బారిన పడి మృత్యువాత పడ్డారు. మంచినీరు కలుషితం కాకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవడంలో విఫలమవుతోంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేక కింది స్థాయి సిబ్బంది నిర్లక్ష్యంతో ప్రజల ప్రాణాలు పోతున్నాయి. తాజాగా ఆత్మకూరు పట్టణంలోని నీలితొట్లవీధిలోఅతిసారం ప్రబలి ఇద్దరు మృతి చెందగా, మరో ఏడుగురు ఆసుపత్రి పాలయ్యారు. తాగునీరు కలుషితమై తీవ్ర దుర్వాసన వస్తోందని, బురుగు బురుగుగా నీళ్ల వస్తున్నాయని స్థానికులు అధికారులకు ఫిర్యాదులు చేశారు. వారం రోజులైనా వారు ఏమాత్రం పట్టించుకోలేదు. బుధవారం రాత్రి కలుషిత నీరు తాగడంలో సుమారు పది మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కొంతమంది స్థానిక ఆర్ఎంపీల దగ్గర మరి కొంతమంది పట్టణ ఆసుపత్రిలో చికిత్స కోసం వెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వీరిని కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. గురువారం చికిత్స పొందుతూ రాత్రి 9 గంటల సమయంలో ఇద్దరు రహంతుల్లా (45), బసిరూన్ (56) మృతిచెందారు. ఏడుగురి పరిస్థితి ఆందోళనకరంగానే ఉన్నట్లు బంధువులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గ్రామీణ నీటి సరఫరా వ్యవస్థ అటకెక్కింది. గ్రామాల్లో ఓవర్ హెడ్ ట్యాంకులు, జీఎల్ఎస్ఆర్, పీడబ్ల్యూఎస్ ట్యాంకుల శుభ్రత గాలికొదిలేశారనే విమర్శలు ఉన్నాయి.





కుళాయిలో వస్తున్న కలుషిత నీరు

ప్రాణాలు పోయాక..

వారం రోజుల నుంచి ప్రజలు ఫిర్యాదు చేస్తున్నా అధికారుల్లో చలనం లేకుండా పోయింది. తాగే నీరు తీవ్ర దుర్వాసనతో వస్తున్నాయని, బురదతో కూడిన బురుగు నీటిని తాగుతున్నామని నీలితొట్లవీధి ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేసినా ఏ ఒక్క రూ పట్టించుకున్న పాపాన పోలేదు. కలుషిత నీటిని తాగి గురువారం ఇద్దరు మృతి చెందారన్న తర్వాత అధికారులు ఉరుకులు పరుగులు పెట్టారు. గురువారం రాత్రి 10 గంటలకే డీఎంహెచ్ఓ, మున్సిపల్ కమిషనర్, స్థానిక రెవెన్యూ, పోలీసు అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వీధిలో నిల్వ ఉన్న నీటిని ఖాళీ చేయించారు. అప్పటికప్పుడు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేశారు. శాంపిల్స్ కోసం కలుషిత నీటిని వదిలేసి ట్యాంకర్ నీటిని తీసుకెళ్లారని స్థానికులు చెబుతున్నారు.

పూర్తి విరుద్ధంగా కలెక్టర్ ప్రకటన

దుర్వాసన, బురుగుతో కూడిన కలుషితమైన

ఆత్మకూరు నీలితొట్ల వీధిలో కాలువలో మంచి నీటి పైప్‌లైన్

నీటిని తాగడం వల్లే ఇద్దరు చనిపోయారని మృతుల బంధువులు, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు చెబుతుంటే.. ఇందుకు పూర్తి విరుద్ధంగా కలెక్టర్ రాజకుమారి ప్రకటన చేశారు. నీటితొట్ల వీధిలో నీరు కలుషితం కాలేదని తేల్చేశారు. గ్రామానికి సరఫరా చేసిన నీటికి సంబంధించి శాంపిల్స్ సేకరించి పరీక్ష చేయించామని, టెస్టుల్లో నెగటివ్ వచ్చిందని తెలిపారు. శుక్రవారం ఆత్మకూరు పట్టణంలోని నీటితొట్ల వీధిలో ఆమె పర్యటించారు. మున్సిపల్, రెవెన్యూ, వైద్య



ఆత్మకూరు నీలితొట్ల వీధిలో డ్రైనేజీలో మంచి నీటి పైప్‌లైన్

ఆరోగ్య సంబంధ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నీరు కలుషితమైనట్లు ఎక్కడా నిరూపణ కాలేదని, ప్రజలెవరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు.

ట్యాంకు శుభ్రం చేయడం లేదు..



మా వీధిలో నీళ్ల ట్యాంకును కొన్ని నెలలుగా శుభ్రం చేయడం లేదు. తాగునీటిలో డ్రైనేజీ నీరు కలవడం వల్లే డయేరియా ప్రబలింది. ట్యాంకు నీళ్లు తాగిన వారంతా వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నారు. అంతకు ముందే కలుషిత నీటిపై మున్సిపల్ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు.

– షేర్ అలి, నీలితొట్లవీధి, ఆత్మకూరు

ఎవరు బాధ్యత వహిస్తారు..



నేను, మా మామ రహంతుల్లా విరేచనాలు, వాంతులతో ఇబ్బంది పడ్డాం. స్థానికంగా ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నాం. తగ్గకపోవడంతో కర్నూలు పెద్దస్పత్రికి వెళ్లాం. అక్కడి వైద్యులు ఏమాత్రం పట్టించుకోలేదు. నేను కొద్దిగా కోలుకున్నా. మా మామ చనిపోయాడు. కంపు కొడుతున్న నీరు వస్తున్నాయని పది రోజుల నుంచి అధికారులకు చెబుతున్నా పట్టించుకోలేదు. ఇద్దరి మరణాలకు ఎవరు బాధ్యత వహిస్తారు.

– కాబెతుల్లా షేర్, మృతుడు రహంతుల్లా అల్లుడు, ఆత్మకూరు

జిల్లాలో ఇలా..

గతేడాది జూన్‌లో జూపాడుబంగ్లా మండలం చాబోలు గ్రామంలో అతిసారం ప్రబలి 20 మంది వరకు తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. చికిత్స పొందుతూ నడిపి నాగన్న అనే వ్యక్తి మృతి చెందాడు.

➤ గతేడాది ఆగస్టు చివరి వారంలో అతిసారంతో పాములపాడు మండలం వేంపెంట బీసీ కాలనీలో కలుషితమైన కుళాయి నీరు తాగి సుమారు 20 మంది గ్రామస్తులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. బోయ లక్ష్మీదేవి అనే మహిళ మృతి చెందింది.

➤ సెప్టెంబర్‌లో ఆళ్లగడ్డను అతిసారం వణికించింది. పట్టణంలోని ఆదర్శ అభ్యుదయ కాలనీలో సుమారు వంద మంది ఆసుపత్రి పాలయ్యారు. పది రోజుల్లో ఆరుగురు మృతి చెందారు.

➤ అక్టోబర్, నవంబర్‌ల్లో నంద్యాల పట్టణంలోని ఎన్‌జీవో కాలనీ, సంజీవ నగర్ గేట్, మూలసాగరం, వన్ టౌన్ ప్రాంతాల్లో నీరు కలుషితమై కొందరు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు.

➤ డిసెంబర్‌లో నంద్యాల పట్టణంలోని ఎన్‌జీవో కాలనీ లలితానగర్‌లో డ్రైనేజీలో మంచి నీటి పైప్‌లైన్ పగిలి నీరు కలుషితమవుతోందని అధికారులకు ఫిర్యాదు చేస్తే పది రోజులకు స్పందించారు.

క్లుప్తంగా

కబడ్డీ విజేత పీకే ప్రాగటూరు జట్టు



విజేత జట్టును అభినందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు పులేంద్రనాయుడు

పగిడ్యాల: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నెహ్రూనగర్‌లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి కబడ్డీ పోటీల్లో పీకే ప్రాగటూరు జట్టు విజేతగా నిలిచింది. పోటీల్లో 16 జట్లు పాల్గొనగా డూమ్ లైట్ల వెలుతురులో శుక్రవారం తెల్లవారుజాము వరకు పోటీలు జరిగాయి. చివరగా నెహ్రూనగర్ మాధవ స్వామి జట్టుపై పీకే ప్రాగటూరు జట్టు విజయం సాధించింది. విజేత జట్లకు వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకులు పులేంద్రనాయుడు నగదు బహుమతులు అందజేశారు.

ఎరువుల దుకాణం తనిఖీ



ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

వెలుగోడు: మండల కేంద్రంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను ఆత్మకూరు ఏడీఏ ఆంజనేయ శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులను, స్టాక్ పాయింట్‌లను పరిశీలించారు. వీరబ్రహ్మేంద్ర ఫర్టిలైజర్స్ దుకాణంలో రూ.3 లక్షల విలువైన 114 లీటర్లు, జై కిసాన్ జువారి ఎరువుల దుకాణంలో రూ.60,500 విలువ చేసే 65 లీటర్ల అనుమతిలేని బయోమందుల విక్రయాలను నిలిపి వేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఏడీఏ వెంట ఏఓ పవన్ కుమార్ ఉన్నారు.

వైభవంగా చంద్రమౌళీశ్వరుడి రథోత్సవం



రథోత్సవ వేడుకల్లో పాల్గొన్న భక్తులు

నందికొట్కూరు: మండల పరిధిలోని బిజినవేముల గ్రామంలో కాశీ చంద్ర మౌళీశ్వరస్వామి రథోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని కనులారా వీక్షించారు. సర్పంచు రవియాదవ్, టౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గాడిచర్ల ఆశయ సాధనకు కృషిచేద్దాం



గాడిచర్ల విగ్రహానికి పూలమాలవేసి జోహార్లు అర్పిస్తున్న నాయకులు

వెలుగోడు: గాడిచర్ల హరిసర్వోత్తమరావు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పలువురు పేర్కొన్నారు. స్థానిక గ్రంథాలయంలో గాడిచర్ల వర్ధంతిని నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. మాజీ సర్పంచ్ అబ్దుల్ కలాం, గాడిచర్ల కమిటీ సభ్యులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి రఘురాముడు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌ను సస్పెండ్ చేయాలి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరు: పట్టణంలో నీరు కలుషితమై ఇద్దరి మృతికి కారణమైన మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబును సస్పెండ్ చేయాలని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్‌మీర్, నాయకులు అహమ్మద్ హుసేన్ డిమాండ్ చేశారు. శుక్రవారం వారు పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యం వల్ల ఇప్పటికే ఇద్దరు మృతి చెందగా మరో నలుగురు చికిత్స పొందుతున్నారన్నారు. పారిశుద్ధ్య పనులు, తాగునీటి సమస్యపై మున్సిపల్ కమిషనర్ తీవ్ర నిర్లక్ష్యం వహించారన్నారు. ఆయన బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఒక్క నీటి ట్యాంకును శుభ్రం చేయించిన దాఖలాలు లేవన్నారు. బాధిత కుటుంబాలకు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేసియా చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటస్వామిగౌడ్, జయకృష్ణ, పార్వతి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

శ్రీశైలంలో నకిలీ నోట్ల చలామణి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలంలో శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో నకిలీ నోట్లు చలామణి అయినట్లు తెలుస్తోంది. శుక్రవారం క్షేత్రంలోని వ్యాపారులు డెయిరీకి డబ్బు చెల్లించేందుకు వెళ్లగా నకిలీ రూ.200 నోటును గుర్తించారు. వెంటనే నకిలీ నోటును చించి వేశారు. వివిధ రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలిరావడంతో వ్యాపారాలు ముమ్మరంగా సాగాయి. ఇదే అదునుగా భావించిన నకిలీ నోట్ల ముఠా వాటిని చలామణి చేసినట్లు తెలుస్తోంది.

సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలి

సాక్షి నెట్‌వర్క్: బాల్యదశ నుంచే సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలని సైన్స్ జిల్లా సమన్వయకర్త కేవీ సుబ్బారెడ్డి సూచించారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నందికొట్కూరు, శ్రీశైలం నియోజకవర్గాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సర్ సీవీ రామన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పగిడ్యాల మండల పరిధిలోని పడమర ప్రాతకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు తయారు చేసిన నమూనాలను ఆయన పరిశీలించారు. హెచ్‌ఎం సువర్ణ పాల్గొన్నారు.

➤ పాములపాడు ఏఎస్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు ఖాజాహుసేన్ పాల్గొన్నారు. వేంపెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం క్రిష్ణమూర్తి ఆధ్వర్యంలో సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు.

➤ మిడుతూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూర్బా బాలికల విద్యాలయం, ఆదర్శ పాఠశాలల్లో జాతీయ సైన్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు.

➤ నందికొట్కూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన విద్యార్థుల సైన్స్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత పాల్గొన్నారు.

➤ శ్రీశైలంప్రాజెక్ట్: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. సైన్స్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.హుస్సేన్ బాషా, అధ్యాపకులు పాల్గొన్నారు.



పడమర ప్రాతకోటలో సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో జిల్లా సమన్వయకర్త కేవీ సుబ్బారెడ్డి, తదితరులు

గుండె నొప్పి బాధితురాలికి టెనెక్ట్ ప్లస ఇంజెక్షన్

మిడుతూరు: గుండె నొప్పితో శుక్రవారం ఆస్పత్రికి వచ్చిన జలకనూరు గ్రామానికి చెందిన భాగ్యమ్మకు రూ.45 వేల విలువ చేసే టెనెక్ట్ ప్లస్ ఇంజెక్షన్ ఇచ్చి ప్రాణాలు కాపాడినట్లు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తిరుపతి తెలిపారు. అనంతరం అంబులెన్స్‌లో కర్నూలు పెద్దాస్పత్రికి రెఫర్ చేశామన్నారు.

కొలతల ప్రకారం పనులు చేయాలి

పాములపాడు: కొలతల ప్రకారం పని చేయాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ సూచించారు. శుక్రవారం మండలంలోని చెలిమిల్ల పరిధిలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. అలాగే బానుముక్కల, చెలిమిల్ల గ్రామాల్లో జీఎస్‌డబ్ల్యూస్ సర్వేను పరిశీలించారు.

వేంపెంట వృషభాల విజయం

పాములపాడు: మండలంలోని ఇస్కాల గ్రామంలో మహా శివరాత్రి సందర్భంగా శుక్రవారం నందీశ్వర క్షేత్రం రైతు సంఘం ఆధ్వర్యంలో ఎండ్ల బండలాగుడు పోటీలు నిర్వహించారు. వేంపెంట నెమలి వెంకటరమణారెడ్డి వృషభాలు ప్రథమ, తెలంగాణ రాష్ట్రానికి చెందిన తిరుపతయ్య వృషభాలు ద్వితీయ స్థానం, కానాల సుబ్రహ్మణ్యం వృషభాలు తృతీయ స్థానాల్లో నిలిచి వరుసగా రూ.40,016, రూ.30,016, రూ.20,016 నగదు బహుమతులను దక్కించుకున్నాయి.

ఉపాధి హామీ పనుల పరిశీలన

బండి ఆత్మకూరు: ఏ.కోడూరు, పార్నపల్లి గ్రామాల పరిధిలో జరుగుతున్న ఉపాధి పనులను శుక్రవారం డ్వామా పీడీ వెంకట సుబ్బయ్య పరిశీలించారు. వంద రోజుల పని దినాలు పూర్తి చేసుకోవాలని కూలీలకు సూచించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీఓ దస్తగిరి, ఏపీఓ వసుధ ఉన్నారు.

కృష్ణ నందిలో..

బండి ఆత్మకూరు: కృష్ణ నంది పుణ్యక్షేత్రంలో మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ పల్లె తిరుపెంరెడ్డి ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులను అలంకరించి పల్లకీలో కొలువుంచి రథోత్సవం నిర్వహించారు.

పుర్రె, ఎముకలు లభ్యం

కొత్తపల్లి: మండల కేంద్రానికి కూత వేటు దూరంలో ఉన్న కనికలమ్మ చెరువులో గుర్తుతెలియని వ్యక్తి పుర్రె, ఎముకలు లభ్యమైనట్లు హెడ్ కానిస్టేబుల్ రవీంద్రబాబు శుక్రవారం తెలిపారు. పురుషుడి పుర్రె, కాళ్లు, చేతుల ఎముకలు, లైట్ పింక్ కలర్ టవల్, చినిగిపోయిన డ్రాయర్, ఆకుపచ్చని రబ్బర్ చెప్పులు లభ్యమయ్యాయన్నారు. గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు వీఆర్వో బాబుమియా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

వార్షికోత్సవాన్ని విజయవంతం చేయండి

కొత్తపల్లి: మార్చి 2న నిర్వహించనున్న భక్తకన్నప్ప గురుకులం వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆవాస కమిటీ అధ్యక్షుడు కోట్ల ప్రభాకర్ రెడ్డి, కార్యదర్శి రఘురాము తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ గోకవరం గ్రామానికి చెందిన జి.పుల్లారెడ్డి చెంచు, గిరిజనులను విద్యావంతులను చేసేందుకు గోకవరం గ్రామంలో భక్తకన్నప్ప గురుకులాన్ని నిర్మించారన్నారు. ఈ ఆవాసాన్ని దాతల సహకారంతో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. సామాజిక దృక్పథం కలిగిన వారు కార్యక్రమంలో పాల్గొని విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించి విద్యార్థులను ఆశీర్వదించాలని కోరారు.

ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

ఆత్మకూరు: వాంతులు, విరేచనాల వల్ల ఇద్దరు మృతిచెందడం బాధాకరమని ఆర్డీఓ నాగజ్యోతి, డీఎంహెచ్ఓ వెంకటరమణ అన్నారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పట్టణంలో వాంతులు, విరేచనాలతో ప్రజలు బాధపడుతుండటంతో వైద్య, పారిశుద్ధ్య సిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు. నీళ్లతొట్టె వీధి, వడ్లపేటలో పారిశుద్ధ్య పనులు చేపట్టామన్నారు. ట్యాంకర్లను శుభ్రం చేయిస్తున్నామన్నారు. వైద్యసేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో తహసీల్దార్ రత్నరాధిక, ఎంపీడీఓ నాగభూషణంశెట్టి పాల్గొన్నారు.

పుష్పశయనోత్సవం

మహానంది: మహానందీశ్వర స్వామి దంపతులకు శుక్రవారం రాత్రి పుష్పశయనోత్సవం పూజలు శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వైభవంగా జరిగాయి.

ఆకట్టుకున్న కన్నడిగుల ప్రదర్శన

మహానందిలో కర్ణాటక కళాకారులు డప్పులు, వాయిద్యాలతో చేసిన విన్యాసాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

బ్రహ్మోత్సవాలు విజయవంతం

సమష్టి సహకారంతో మహానందిలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు విజయవంతమయ్యాయని చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్, డిప్యూటీ కమిషనర్ ఎం.రామాంజనేయులు, ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి అన్నారు. రథోత్సవం అనంతరం వారు మాట్లాడారు.

పటిష్ట బందోబస్త్

శ్రీశైలంటెంపుల్: పటిష్టమైన బందోబస్త్ మధ్య శ్రీశైల మహాక్షేత్రంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగిశాయని ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి దుర్మరణం



మృతి చెందిన బాలుడు షేక్ అబ్దుల్లా(ఫైల్)

నందికొట్కూరు: పట్టణ సమీపంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద కర్నూలు–గుంటూరు రహదారిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ విద్యార్థి దుర్మరణం చెందాడు. టౌన్ ఎస్ఐ సురేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణంలోని షేక్ రహంతుల్లా, షేక్ రిజ్వాన దంపతుల కుమారుడు షేక్ అబ్దుల్లా(13) ఓ ప్రైవేటు స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నాడు. గురువారం రాత్రి సరదాగా అబ్దుల్లా తన స్నేహితులు కుమార్, లక్ష్మీకాంత్‌తో కలసి స్కూటీపై జాతీయ రహదారి వైపు వెళ్లారు. ఆ సమయంలో రాంగ్ రూట్‌లో వెళ్తుండగా కర్నూలు వైపు వెళ్తున్న కారు ప్రమాదవశాత్తూ స్కూటీని ఢీకొంది. స్కూటీ నడుపుతున్న షేక్ అబ్దుల్లా తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మిగతా ఇద్దరికి గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు. మృతుడు తల్లి షేక్ రిజ్వానా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు టౌన్ ఎస్ఐ సురేష్ తెలిపారు. కాగా రోడ్డు ప్రమాదంపై మృతుడి కుటుంబీకులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. రహదారిపై స్కూటీని ఢీకొన్నట్లు ఆనవాళ్లు కనిపించడం లేదని, తమకు సమాచారం ఇవ్వకుండా మృతదేహాన్ని ఎందుకు తరలించారని పోలీసులను ప్రశ్నిస్తున్నారు. మద్యం మత్తులో కారు డ్రైవర్ రాంగ్ రూట్‌లో డ్రైవింగ్ చేస్తూ స్కూటీని ఢీకొట్టాడనే అనుమానం ఉందని, పోలీసులు అధికారులు విచారణ చేయాలని కోరుతున్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



తాలూకా అధ్యక్షులు నర్సరాజును సన్మానిస్తున్న జిల్లా నాయకులు

నందికొట్కూరు: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు నాగేంద్రప్ప తెలిపారు. శుక్రవారం రెవెన్యూ కార్యాలయంలో ఏపీజీఈఏ తాలూకా అధ్యక్షుడిగా నర్సరాజు, కార్యదర్శి గా భువనేశ్వరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గతే డాది ఎన్నుకున్న తాలూకా అధ్యక్షుడు బాల రాజు రాజీనామా చేయడంతో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ ఎలాంటి సమస్యలు వచ్చినా రాష్ట్ర అధ్యక్షులు సూర్యనారాయణ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం నూతన తాలూకా అధ్యక్ష, కార్యదర్శులను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి తిరుపాలయ్య, తాలూకా ఉపాధ్యక్షుడు మద్దిలేటి, కోశాధికారి రాముడు, సభ్యులు సిరాజ్, జాకీర్‌హుసేన్, రాజశేఖర్, నంద్యాల టౌన్ అధ్యక్షులు సత్యం పాల్గొన్నారు.

కనిపించని టౌన్ ప్లానింగ్ కార్యాలయం

- అయోమయంలో పట్టణ ప్రజలు, కౌన్సిలర్లు

నందికొట్కూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల కాలంలో టౌన్ ప్లానింగ్ కార్యాలయాన్ని పదేపదే మార్పు చేస్తుండటంతో పట్టణ ప్రజలు, ప్రజాప్రతినిధులు ఆందోళన చెందుతున్నారు. మున్సిపల్ కార్యాలయంలోని టౌన్ ప్లానింగ్ కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం రోజూ పెద్ద సంఖ్యలో వస్తుంటారు. గురువారం వరకు ఉన్న టౌన్ ప్లానింగ్ కార్యాలయాన్ని మరోచోటుకు మార్పు చేయడంతో శుక్రవారం ఉదయం అక్కడికి వెళ్లిన ప్రజలు, ప్రజాప్రతినిధులకు కమిషనర్, అధికారులు లేకపోవడంతో అవాక్కయ్యారు. దీంతో కౌన్సిలర్లు రవూఫ్, లాలు ప్రసాద్. టౌన్ ప్లానింగ్ అధికారి రంగస్వామిని ఆరా తీశారు. ఆయన సమాధానం చెప్పకుండా వెళ్లిపోయారు.



టీపీఓను నిలదీస్తున్న కౌన్సిలర్లు రవూఫ్, లాలు ప్రసాద్

టీపీఓ కార్యాలయం మరమ్మతుల పేరుతో రూ.5 లక్షల ప్రజల సొమ్ము ఖర్చు చేసి, తీరా కార్యాలయాన్ని మార్పు చేయడం ఏమిటని కౌన్సిలర్లు టీపీఓను నిలదీశారు. టౌన్ ప్లానింగ్ కార్యాలయాన్ని పదేపదే ఎందుకు మార్చుతున్నారో జిల్లా కలెక్టర్ విచారణ చేసి చర్యలు తీసుకోవాలని లేకపోతే ప్రజలతో కలిసి ధర్నా చేస్తామని కౌన్సిలర్లు హెచ్చరించారు.

ఓంకారేశ్వరుడికి రూ.1,74,824 ఆదాయం

బండి ఆత్మకూరు: మండలంలోని ఓంకారేశ్వరాలయ హుండీ కానుకలను శుక్రవారం లెక్కించగా రూ.1,74,824 ఆదాయం వచ్చినట్లు ఈఓ నాగప్రసాద్ తెలిపారు. శివరాత్రి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన హుండీలో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించామన్నారు. పర్యవేక్షణాధికారి ఎం.కార్తీక్, అర్చకులు మల్లికార్జున, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



కానుకలను లెక్కిస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో సంజీవరాయుడికి అమావాస్య పూజలు




స్వామివారికి పల్లకీసేవా నిర్వహిస్తున్న దృశ్యం



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

మిడుతూరు: రోళ్లపాడు అభయారణ్యంలో వెలసిన బరక సంజీవరాయస్వామికి అమావాస్య సందర్భంగా శుక్రవారం అభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన, ఆకుపూజ, ఊయల సేవా, పల్లకీ సేవా నిర్వహించారు. పురోహితులు నరహరి శర్మ, వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో స్వామివార్లను అలంకరించి పల్లకీలో ఆశీనులను చేసి భాజాభజంత్రీల మధ్య ఆలయ ప్రదక్షిణలు చేస్తూ పల్లకీ సేవను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో మన్యసూక్త హోమం వేదమంత్రోచ్ఛరణల మధ్య నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పేరెడ్డి మురళీమోహన్ రెడ్డి, సర్పంచ్ పేరెడ్డి వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.



పూజలందుకున్న స్వామివారు